# స్వచ్ఛ నంద్యాలకు మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం

**నంద్యాల, న్యూస్‌టుడే:** నంద్యాల పురపాలక సంఘాన్ని బహిరంగ మలమూత్ర విసర్జన రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు సమష్టిగా కృషి చేస్తామని నంద్యాల పురపాలక అధ్యక్షురాలు దేశం సులోచనతో పాటు కౌన్సిలర్లు శనివారం జరిగిన అత్యవసర సమావేశంలో తీర్మానించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ పంపిన ఉత్తర్వుల మేరకు పట్టణంలోని కౌన్సిలర్లు తమ వార్డుల్లో బహిరంగ మలమూత్ర విసర్జన రహిత ప్రాంతాలుగా తీర్చిదిద్దేందుకు సముఖత వ్యక్తం చేస్తూ మాట్లాడారు. అక్టోబరు 2 నుంచి పట్టణంలోని 42 వార్డుల్లో ఈ కార్యక్రమం చేపట్టేందుకు తీర్మానించారు. పురపాలక అధ్యక్షురాలు సులోచన మాట్లాడుతూ... సామూహిక మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.1.60 కోట్లు కేటాయించామని తెలిపారు. కౌన్సిలర్లు అవసరమైనచోట వాటి ప్రతిపాదనలు పంపితే వెంటనే నిర్మిస్తామన్నారు. కమిషనర్ సత్యనారాయణరావు మాట్లాడుతూ... వ్యక్తిగత మరుగుదొడ్లకు బిల్లుల బకాయిలను చెల్లిస్తామన్నారు. దీనిపై కౌన్సిలర్లు అనిల్ అమృత్‌రాజు, కత్తి శంకర్, పడకండ్ల సుబ్రహ్మణ్యం, లక్ష్మీదేవి, జాకీర్‌హుస్సేన్, జేవీసీ హారిక, చాంద్‌బీ, శివశంకర్, కొండారెడ్డి, కృపాకర్ మాట్లాడుతూ.. బహిరంగ మలమూత్ర విసర్జన లేకుండా ప్రజలకు అవగాహన కల్పించేందుకు క్షేత్ర స్థాయిలో చర్యలు తీసుకోవాలని కోరారు. పట్టణంలోని ప్రధాన ప్రాంతాల్లో సంచార మరుగుదొడ్లు, సామూహిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని కౌన్సిలర్లు కోరారు.



మాట్లాడుతున్న అధ్యక్షురాలు దేశం సులోచన



పాల్గొన్న కౌన్సిలర్లు

పట్టణంలోని హిందూ శ్మశానవాటిక అభివృద్ధి చేయడానికి నంద్యాల నవనిర్మాణ సమితికి దత్తతనిస్తూ కౌన్సిల్ తీర్మానించింది. ఎంత కాలం నిర్వహణకు ఆ సంస్థకు అప్పగించాలో తదుపరి సంస్థ సభ్యుల సమావేశం తర్వాత నిర్ణయిస్తామని అధ్యక్షురాలు ప్రకటించారు. పట్టణంలోని మూడు ప్రాంతాలను 163 సూక్ష్మ సముదాయాలుగా మార్చి వాటిల్లో ప్రభుత్వ ఉత్తర్వు 279 మేరకు పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణకు పొరుగు సేవలకు అప్పగించేందుకు కౌన్సిల్ తీర్మానించింది. ఇందుకు సంబంధించి మొదటి సంవత్సరం రూ.8.09 కోట్లు, రెండో ఏడాది రూ.7.80 కోట్లు, మూడో ఏడాది రూ.7.80 కోట్లతో మొత్తం మూడేళ్లలో రూ.23.69 కోట్లతో పొరుగు సేవలకు అప్పగించాలని, దీంతోపాటు పలు అంశాలపై అత్యవసర సమావేశంలో తీర్మానించారు.